# విజయం సాధించాలంటే..

జయప్రకాశ్

**ప్రతి బుల్ మార్కెట్ జననం నిరాశావాదం శిఖర స్థాయిలో ఉన్నప్పుడు జరుగుతుంది. శంకలు, అనుమానాల మధ్య విస్తరిస్తుంది. సర్వత్రా ఆశావాదం నెలకొన్నప్పుడు ఎదుగుతుంది. మదుపరులు వేలంవెర్రిగా ఎగబడుతున్నప్పుడు చనిపోతుంది (ముగుస్తుంది).**

– స్టాక్‌మార్కెట్‌పై ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ గురు జాన్ టెంపుల్‌టన్ విశ్లేషణ ఇది.



ప్రస్తుతం మార్కెట్ తీరును గమనిస్తే ఈ మాటలు ఎంత అక్షర సత్యాలో ఇట్టే బోధపడుతుంది. పరిస్థితులన్నీ అత్యంత నిరాశాజనకంగా మారిన తరుణంలో గత ఏడాది అక్టోబరు 27 నాడు నిఫ్టీ 2250 పాయింట్ల వద్ద బుల్ మార్కెట్‌కు అంకురార్పణ జరిగింది. అక్కడి నుంచి ఎనిమిది నెలల వ్యవధిలో నిఫ్టీ రెట్టింపు అయింది. తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ సత్తాను, వ్యాపార రంగంలో అంతర్లీనంగా ఉన్న సమర్థతను అది ప్రతిబింబించింది.

ఈ నేపథ్యంలో స్టాక్‌మార్కెట్లో సాధారణంగా అయిదేళ్ల ఒక భ్రమణం (సైకిల్) లో ఉన్న నాలుగు దశలను మదుపుదార్లు అర్థం చేసుకోవడం అవసరం.

## 1 పోగేయడం

బుల్ మార్కెట్‌కు శైశవ దశ ఇది. ఈ దశలో తెలివైన మదుపుదార్లు దీర్ఘకాలిక దృష్టితో షేర్లను కొనుగోలు చేయడం మొదలుపెడతారు. బలహీనమైన మదుపరుల నుంచి బలమైన మదుపుదార్ల చేతికి షేర్లు వచ్చి చేరతాయి. మార్కెట్‌లో అంతర్లీనంగా బలం కనిపిస్తూ ఉంటుంది.

## 2 వేగంగా పెరగడం

ఒక్కసారిగా మార్కెట్లో ఆశావహ ధోరణి చోటు చేసుకొంటుంది. తెలివైన మదుపరులు భారీగా కొనుగోళ్లు చేస్తూ, మార్కెట్ వేగంగా పెరిగేందుకు దోహదపడతారు. ఆర్థిక వ్యవస్థ పునాదులు, కంపెనీల



స్థితిగతులు బలంగా కనిపించడం ప్రారంభం అవుతుంది. మార్కెట్ సూచీలు అదే పనిగా పైపైకి దూసుకువెళ్లిపోతాయి.

## 3 అంటగట్టడం

నెమ్మదిగా సాధారణ మదుపుదార్లలో వేడి పుడుతుంది. నిరాశావాదాన్ని వీడి బయటకు వస్తారు. మార్కెట్లో మెరుగైన ప్రతిఫలాన్ని పొందే అవకాశాన్ని చేజార్చుకొంటున్నామనే ఆందోళన వారిలో మొగ్గ తొడుగుతుంది. అప్పటికే వేగంగా పెరిగిన షేర్ల ధరలు కాస్త కిందికి దిగివస్తాయేమోనని ఎదురుచూస్తారు. అందుకు తగిన సంకేతాలు కనిపించకపోవడంతో ఇక కొనుగోళ్లకు దిగుతారు. అలా బలమైన చేతుల నుంచి బలహీనమైన చేతుల్లోకి షేర్లు మారిపోతాయి. మార్కెట్లో మళ్లీ బలహీనత చోటుచేసుకొంటుంది.

## 4 అమాంతంగా పడిపోవడం

షేర్లు పూర్తిగా బలమైన మదుపుదార్ల నుంచి బలహీనమైన మదుపుదార్ల చేతుల్లోకి వచ్చేస్తాయి. తెలివైన మదుపుదార్లు మార్కెట్ నుంచి పూర్తిగా తప్పుకొంటారు. మార్కెట్ కుప్పకూలిపోతుంది.

గత అయిదేళ్ల బుల్ మార్కెట్‌ను, ఆ తరువాత అది నిట్టనిలువుగా కూలిపోయిన వైనాన్ని... కొంత విరామం అనంతరం మార్కెట్లు మళ్లీ వేగంగా కోలుకున్న తీరును చూసిన వారెవరికైనా పైన పేర్కొన్న విషయాలు సులువుగా బోధపడతాయి. ఈ నేపథ్యంలో తాజా పరిస్థితిని చూస్తే, తదుపరి బుల్ మార్కెట్‌కు సంబంధించి మొదటి దశ ప్రారంభమైనట్లు భావించవచ్చు. ఈ బుల్ మార్కెట్ మూడో దశకు చేరుకునే నాటికి నిఫ్టీ సూచీ 8,000 పాయింట్లను చేరుకునే అవకాశం లేకపోలేదు.

### భారత్-వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ

స్వాతంత్ర్యం వచ్చిన మొదటి ముప్పై ఏళ్లలో (1977 వరకు) భారత్ ఆర్థికాభివృద్ధి 3 శాతం మాత్రమే. తదుపరి మూడు దశాబ్దాల్లో (2007వరకు) ఇది 5 శాతానికి పెరిగింది. వచ్చే ముప్పై సంవత్సరాల్లో (2037దాకా) ఆర్థికాభివృద్ధి 7 శాతం ఉండవచ్చు. ఏ రకంగా చూసినా 2037 నాటికి ప్రపంచంలోని మూడు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఇండియా నిలుస్తుంది. అందువల్ల దేశ ఆర్థిక వ్యవస్థలోని బలాన్ని, బుల్ మార్కెట్ తీరును అర్థం చేసుకొని స్టాక్ మార్కెట్ సవారీని క్షేమంగా పూర్తి చేసేందుకు మదుపుదార్లు ప్రయత్నించాలి.

ఈ సందర్భంగా ప్రపంచ ప్రముఖుల పెట్టుబడి సూత్రాలు మననం చేసుకోవడం అవసరం. అవి..

వారెన్ బఫెట్ – వేల్యూ ఇన్వెస్టింగ్.

సర్ జాన్ టెంపుల్‌టన్ – కాంట్రారియన్ ఇన్వెస్టింగ్.

జాన్ సి.బోగ్లే – ఇండెక్స్ ఇన్వెస్టింగ్.

**ఈ సూత్రాలు ప్రతి ఒక్క మదుపుదారుడినీ ఉత్తేజపరుస్తాయి. విజయ శిఖరాల మీద నిలబడమని ప్రేరేపిస్తాయి. అది మీరే ఎందుకు కాకూడదు? ప్రయత్నిస్తారు కదూ.**

*(వ్యాస రచయిత హైదరాబాద్‌లోని ఆర్‌ఎల్‌పీ సెక్యూరిటీస్ డైరెక్టర్)*